క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలు అందించాలి



శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ సహాయకులు బోడ్డుపల్లి అయ్యన్నను వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ మాట్లాడుతూ ముప్పాళ్ళ మండలం అరేపల్లి ఆరోగ్య కేంద్రంలో జూనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సీనియర్ సహాయకులుగా ఇక్కడకు రావటం మంచి శుభపరిణామన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వపరంగా మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసి ఆరోగ్య కేంద్రానికి మంచిపేరు వచ్చేలా సీనియర్ సహాయకులు అయ్యన్న కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ను అలవలపూడి ఏడుకొండలు, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మీ ప్రసన్న, సీతారామయ్య, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

భవిత సెంటరు సేవలు ఉపయోగించుకోండి

ఎంఈవో సాంబశివరావు



శావల్యాపురం: ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారుల తల్లిదండ్రులు భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురంలో భవిత సెంటరును సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ భవిత కేంద్రాల సేవలతో పిల్లల ఆరోగ్యం మెరుగుదలతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. మానసిక వైకల్యం, వినికిడి లోపం చలన వైకల్యం వంటి ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారులు భవిత సెంటరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో ఫిజియోథెరపిస్ట్ స్వాతీ, ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతీ పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు గాయాలు

చిలకలూరిపేటటౌన్: ప్యాసింజర్ ఆటో బోల్తా పడటంతో మహిళ గాయాలైన సంఘటన రూరల్ మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బీ నరసరావుపేటలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు శుక్రవారం లింగంగుంట్ల జంక్షన్ వద్ద ఆటో ఎక్కింది. కావూరు గ్రామం శివారులో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికుల్లో మహబూబ్‌బీకి మాత్రమే గాయాలయ్యాయి. బాధితురాలిని నరసరావుపేట ఆస్పత్రికి తరలించగా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక శుక్రవారం తెలిపారు. క్రిష్టియన్ పాలెంకు చెందిన మందపాటి సురేష్(38)కు అతని భార్యకు మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావటంలేదని మనస్థాపం చెందిన సురేష్ ఈ నెల 17వ తేదీన ఇంట్లో గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ మృతుడు ఏ ఊరివాడో?



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలోని కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏపీ 07డీఏ8074 నంబర్ మోటార్ సైకిల్‌పై గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా అదేమార్గంలో ఒంగోలు నుంచి హైదరాబాదు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతిచెందిన వ్యక్తినీ గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రొంపిచర్ల ఎస్సై మణికృష్ణ ప్రమాద స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో చురుకైన మెదడు

నాదెండ్ల: మండలంలోని చందవరం ప్రాథమిక పాఠశాల (ఎల్‌ఈ)లో శుక్రవారం యోగా నిర్వహించారు. మూడు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో యోగా శిక్షకురాలు వై.రాజ్యలక్ష్మీ యోగాసనాలు వేయించారు. యోగా యొక్క ఆవశ్యకత, ఆసనాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ యోగా చేయటం వలన విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మెదడు చురుగ్గా పనిచేసి చదువులో చక్కగా రాణిస్తారన్నారు.

యోగా మన జీవనంలో భాగం కావాలి

నూజెండ్ల: యోగా చేయటం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు ఘంటా శ్రీనివాసరావు అన్నారు. 11 వ అంతర్జాతీయ యోగా దినాన్ని పురస్కరించుకుని ఐనవోలు గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం, యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండంటూ ప్లకార్డుల విద్యార్థులు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు ఘంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా సాధన ద్వారా మానసిక ఒత్తిడిని జయించటంతో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. యోగా ప్రయోజనాలను గ్రామస్తులకు ఆయన వివరించారు.

యోగా వేడుకలు విజయవంతం చేయండి

శావల్యాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసచివాలయాలు, అన్ని ప్రభుత్వ పాఠశాలల నందు విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలను ఏడు సెక్టార్లుగా విభజన చేసి యోగా కార్యక్రమాలు విజయవంతమయ్యేలా మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తారన్నారు. వేల్పూరు 1,2 సచివాలయాల పరిధిలో ఈవోపీఆర్‌డి పి.సుగుణ, శావల్యాపురం గ్రామసచివాలయం-పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి, కొత్తలూరు-పిచికలపాలెం గ్రామ సచివాలయాలు-ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, కారుమంచి, గుంటుపాలెం-ఏపీవో రామారావు, కనమర్లపూడి-ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, పోట్లూరు-ఐసీడిఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, శానంపూడి , మతుకుమల్లి గ్రామసచివాలయాలు-కె.వాసుబాబులు పర్యవేక్షణ చేస్తారన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



ఏఎం రెడ్డి కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఏఎం రెడ్డి కళాశాలలో..

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రీ యోగా డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే థీమ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో డిప్లొమా, బీటెక్ విద్యార్థులు, అన్ని శాఖల అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యోగాను ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ మల్లికార్జున్ తెలిపారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుత జీవనశైలిలో మార్పుల వలన ప్రజలు అనేక రకాలైన రోగాల బారినపడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు యోగాను ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయాలి

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ జరిగే యోగా కార్యక్రమానికి స్థానికులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ ప్రతిష్టను పెంపొందించాలి

తహసీల్దారు అర్జున్‌నాయక్

శావల్యాపురం: రెవెన్యూ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు పారదర్శకంగా సకాలంలో అందించాలని తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ డే పురస్కరించుకొని పదవీ విరమణ చేసిన రెవెన్యూ అధికారులకు ఘన సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో చాలా కీలకమైన శాఖ రెవెన్యూ శాఖ అన్నారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు, భూసేకరణ, సర్వే, వివిధ రకాల పత్రాలు జారీ, ప్రభుత్వ పథకాలు అమలు వంటి ప్రజలకు అందించాల్సిన అన్ని సేవలు రెవెన్యూ శాఖతో ముడిపడి ఉన్నాయన్నారు. వీఆర్వోలు తమ విధులు అంకిత భావంతో నిర్వహించి ప్రజలకు సుపరిపాలన అందించాలన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన డిప్యూటీ తహసీల్దారు అబ్బూరి వెంకటేశ్వర్లు, వీఆర్వో చల్లగుండ్ల వెంకటేశ్వర్లును పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, సర్వేయర్ రాజు, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఉప్పులూరి చిన మంగయ్య, వీరవల్లి నాగ సంతోష లక్ష్మి, మల్లెల రాధ, దూపాటి దేవమ్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ ఉద్యోగులను సత్కరిస్తున్న తహసీల్దారు అర్జున్ నాయక్

పదిగంటల పని దినాల్ని ఉపసంహరించుకోవాలి

ఏఐటీయూసీ డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: కార్మికులను బానిసలుగా చేసే 10 గంటల పని దినం విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 10 గంటల విధానాన్ని ఉపసంహరించుకుంటూ తీర్మానించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం 10 గంటల పని విధానానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 10 గంటల పని దినాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళల్లో మహిళలచే పని చేయించే ఆలోచన మానుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, స్కీం కార్మికులకు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, జానీ, వెంకటేశ్వర్లు, సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

కూటమి నిర్ణయాలు కార్మికవర్గానికి వ్యతిరేకమైనవి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్



నరసరావుపేట: కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని పరిమితులు లేని 14 నుంచి 20 గంటల పని విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ మండిపడ్డారు. శుక్రవారం కోటప్పకొండ రోడ్డులోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ 10 గంటల విధానం అమలు చేయాలని నిర్ణయించడం సిగ్గుచేటని, అదేవిధంగా రాత్రి సమయంలో మహిళలతో పని చేయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాసే విధంగా పనిగంటలను పెంచుతూ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్మికవర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు పనిఒత్తిడి పెరిగిందని, రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తుందన్నారు. పదిగంటల పని విధానానికి వ్యతిరేకంగా నిరుద్యోగులు కార్మికులతో కలిసి పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో 15 ఏళ్ల నుంచి వేతనాలు పెరగలేదని పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లు నిలుపు చేయకపోతే మోదీ ప్రభుత్వం కార్మిక వర్గ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని కూటమి నేతలను హెచ్చరించారు.

వాషింగ్టన్ హ్యాక్‌థాన్‌లో ప్రతిభ అవార్డు



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని వంకాయల తేజశ్రీ వాషింగ్టన్ హ్యాక్‌థాన్‌లో ఉత్తమ ప్రతిభ అవార్డు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. వాషింగ్టన్ యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వహించిన వాషింగ్టన్ 25 హ్యాక్‌థాన్ 2025లో ప్రతిభ కనబర్చి అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తేజశ్రీని కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వర రావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఎన్ తిరుమలరావులు అభినందించారు. స్టార్టప్‌గా కన్వెర్ట్ చేయమని వారు సూచించారు. స్టార్టప్‌కు అవసరమైన గైడెన్స్, అందుకు అవసరమైన ఖర్చును కళాశాల భరిస్తుందని కళాశాల యాజమాన్యం విద్యార్థినికి తెలిపింది.

రక్త దానం చేయండి- ప్రాణదాతలు కండి

నూజెండ్ల: రక్త దానం చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందని, యువతలో మానవతా విలువలు పెరుగుతాయని ఐనవోలు ప్రజా వైద్యశాల వైద్యాధికారి దీపికా మంజూషా అన్నారు. పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నూజెండ్ల ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన వైద్యాధికారి దీపికా మాట్లాడుతూ రక్త దానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావచ్చన్నారు. ముఖ్యంగా యువత అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి మెరుగు పరుచుకోవచ్చన్నారు. రక్తం తయారు చేయలేరని దానం ద్వారానే అత్యవసరమైన వారికి రక్తం అందుతుందన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల లోపు ఆరోగ్యవంతులు రక్త దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు బాల వెంకటేష్, సైదులు, పల్నాడు జిల్లా వినుకొండ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నరసరావుపేట రూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు. మెడికొండూరు మండలం పొట్లపాడు గ్రామానికి చెందిన పాటిబండ్ల విద్యాసాగర్(18) తన స్నేహితుడు పాటిబండ్ల వంశీతో కలిసి ద్విచక్రవాహనంపై వినుకొండ వైపు వెళ్తుండగా పెట్లూరివారిపాలెం సమీపంలో ఎదురుగా వచ్చిన ఎర్టిగా కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో విద్యా సాగర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వంశీకి తీవ్ర గాయాలు కావడంతో వంశీని గుంటూరుకు తరలించి చికిత్స అందిస్తు న్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీ సులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పట్టణంలోని నరసరావుపేట మార్గంలోని ఆదర్శ గృహకల్ప కాలనీ సముదాయాల్లో నివసిస్తున్న అవివాహితుడు అనంతవరం గోపీ (37) శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. సము దాయంలోని సమీప నివాసితులకు వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు రవి ఉంటున్న ఎఫ్-7 అపార్టుమెంట్‌లోని గదిలోకి వెళ్లి చూడగా సుమారు మూడు రోజుల కిందట మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. మద్యం సేవించి ఇంట్లోనే పడుకుని ఉండగా, గొంతు తడారి చనిపోయి ఉంటారని భావిస్తున్నారు.

తల్ సైనిక్ క్యాంప్‌నకు 10 మంది క్యాడెట్స్

నరసరావుపేట రూరల్: రాష్ట్ర స్థాయి తల్ సైనిక్ క్యాంప్ పోటీలకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 10 మంది క్యాడెట్స్ ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. జూలై 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అనంతపూర్‌లో నిర్వహించే రెండు తెలుగు రాష్ట్రాల ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో 10 మంది క్యాడెట్స్ పాల్గొంటారని తెలిపారు. జిల్లా, బెటాలియన్, గ్రూప్ స్థాయిలో జరిగిన ఎంపిక శిబిరాల్లో కఠినమైన శారీరక, మానసిక పరీక్షలను విజయవంతంగా అధిగమించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పర్మర్, కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చిలకలూరిపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు చుక్కా విన్సెంట్‌పాల్ చెప్పారు. స్థానిక డీఆర్‌ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో...

చిలకలూరిపేట విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాడే నిర్వహించారు. విద్యుత్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ ఏడుకొండలు, డీఈఈ ఆర్ అశోక్‌కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఆర్‌ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాలలో యోగా కార్యక్రమం

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

సత్తెనపల్లి: మానవ మనుగడకు ప్రాణవాయువైన ఆక్సిజన్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. సత్తెనపల్లి మండలం వావిలాలనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో మనిషి కనీసం 50 మొక్కలు నాటినా భూ మండలంపై ఎక్కడ చూసినా పచ్చని చెట్లు కళకళలాడతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు కుంభ ఏడుకొండలు మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మన తల్లి ఏ విధంగా పెంచిందో అదే విధంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మనిషి జీవితంలో మొక్కలు అనేక విధాలుగా ఉపయోగపడతున్నాయన్నారు. మొక్కలు మానవ మనుగడలో భాగమన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు దమయంతి, యోగేశ్వరి, ఆయాలు, చిన్నారులు, పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అనంతలక్ష్మి, ఏడుకొండలు, బుల్లిబాబు, తదితరులు

అన్ని శాఖలకు రెవెన్యూ శాఖ ఆదర్శవంతం

రాజుపాలెం: ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకుని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. మండల తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ పురాతన కాలంలో ఏర్పాటు చేయబడి నేటికీ కొనసాగుతున్న సుసంపన్నమైన శాఖ రెవెన్యూ శాఖ అని కొనియాడారు. పారదర్శకమైన జవాబుదారీ పరిపాలనను అందించడంలో రెవెన్యూ శాఖ తోడ్పడుతుందని తెలిపారు.



నాగేశ్వరరావును సత్కరిస్తున్న తహసీల్దారు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

చిలకలూరిపేట: న్యాయవాది పట్ల ఓ మహిళ అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ చిలకలూరిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్‌ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల ఓ షాపింగ్ మాల్‌లో న్యాయవాది బి.వేణుబాబు, అతని కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసు నమోదు చేయడం ఇష్టం లేని శిరీషా బాయి అనే మహిళ మరికొంతమంది వెంటబెట్టుకొని అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసుల సమక్షంలోనే పోలీసులు, న్యాయవాదులు అన్న కనీస మర్యాద లేకుండా దుర్భాషలాడటం జరిగిందన్నారు. దీనిని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నట్లు వివరించారు. అనంతరం న్యాయమూర్తులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై శ్రీనివాసరావు, కార్యదర్శి టి.రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎస్‌కే సైదావలి, కోశాధికారి జి.శివరామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలకు ఘన సత్కారం

యడ్లపాడు: రెవెన్యూ శాఖ అనేది ఎన్నో ఇతర శాఖలకు మాతృసంస్థని..ఇందులో పనిచేసే ఉద్యోగులు ప్రజల పట్ల సేవాతత్పరతతో మెలగాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ చెప్పారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో విశేష సేవలందించిన మాజీ ఉద్యోగులు వంకాయలపాటి హుళక్కి, నంబూరి శ్రీనివాసరావు, షేక్ ఖాసీం, యడ్లపాటి లక్ష్మీనారాయణలతో పాటు ప్రస్తుత యడ్లపాడు వీఆర్వో ఎండీ రఫుల్లా, చెంఘీజ్‌ఖాన్‌పేట వీఆర్‌ఏ పఠాన్ యూసఫ్‌ఖాన్‌లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్, డీటీ అనురాధ, ఆర్ఐ ముప్పాళ్ల సుబ్బారావు, మండల సర్వేయరు గేరా సురేంద్రనాథ్, వీఆర్వో కేపీ చారి, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ప్రసంగించారు.

ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన వరం

చిలకలూరిపేట: ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన వరం వంటిదని... దానికి ధనిక, పేద తేడా లేదని తహశీల్దార్, సహాయ ఎన్నికల అధికారి షేక్ మొహమ్మద్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో ఉన్న శారదాంబ జెడ్పీ హైస్కూల్‌లో నా ఓటు- నా హక్కు, ఓటు అమ్మకం లేని నవభారతావని నిర్మిద్దాం అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం, స్కూల్ హెచ్ఎం డి ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమరావతి కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ హాజరై ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి ఎంపీపీ ఎల్‌ఈ, ఎంపీయూపీ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుందో, దానిని ఎలా నివారించాలో తెలియజేశారు. ముఖ్యంగా బోర్ వెల్ నీరు, పొగాకు సంబంధిత వస్తువులు, పానీపూరి, కుర్ కురే వంటి వాటిని తినడం.. ప్రధానంగా అందులో కలిపే బ్లాక్ సాల్ట్ వల్ల ఈ వ్యాధి సక్రమించే అవకాశం ఉందన్నారు. అలాగే బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారన్నారు. ఈ సందర్భంగా 3, 4, 5 తరగతుల పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే కమ్యూనిటీ సర్వే కూడా గ్రామంలో నిర్వహించాలని సూచించారు. ఈ వ్యాధి నివారణకు రక్షిత తాగు నీరు, కాల్షియం, విటమిన్ సీ, ఈ పోషకాలు అధికంగా ఉన్న కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఒ.లక్ష్మీమనోహర్, సీహెచ్‌వో సంధ్యా రాణి, సిబ్బంది ఆశా కుమారి, ఎ.కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇరువురు యువకులకు విద్యుదాఘాతం

బొల్లాపల్లి: విద్యుత్ లైనుల మరమ్మతులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతంతో ఇరువురు యువకులు కిందపడి గాయపడ్డారు. ఘటన మండంలోని గుట్లాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌పరిధిలో ఘాటి తండా వద్ద శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ఘాటి తండాకు చెందిన ఒడితే పుంసానాయక్, భుక్యా అఖిల్ నాయక్ విద్యుత్ శాఖ అధికారులు నూతన లైనులు ఏర్పాటు చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను వైద్యులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సోలస క్లస్టర్ సీసీకి తీవ్ర గాయాలు

యడ్లపాడు: మండలానికి చెందిన వెలుగు సోలస క్లస్టర్ కమిటీ సభ్యుడు గొల్లమూడి నాగేశ్వరరావు గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సుమారు 9 గంటల సమయంలో మండలంలోని సంతపేట వద్ద నాగేశ్వరరావు ప్రయాణిస్తున్న బైక్‌ను మరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన కాలు విరిగినట్లు తెలుస్తోంది. వెంటనే స్పందించిన స్థానికులు ఆయనను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆయనకు చికిత్స అందిస్తున్నారు.